# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో


వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 287 బుధవారం 22 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# 17 జిల్లాలా.. 22 జిల్లాలా

## తమ ప్రభుత్వం రాగానే జిల్లాల సంఖ్య తగ్గిస్తానని గతంలో సీఎం హామీ

- గతంలో కేసీఆర్ పరిపాలనా సౌలభ్యం కోసం ఉమ్మడి 10 జిల్లాల సంఖ్యను 33 జిల్లాలుగా మార్చారు.
- ఈ విభజన శాస్త్రీయంగా జరగలేదని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపణ
- సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం
- 33 జిల్లాలకు సంబంధించి నిధుల సమస్య కూడా ఎదురవుతోందని ప్రస్తుత ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డికి ఇప్పటికే నివేదికలు
- జనాభా లెక్కల ప్రకారం చేస్తే 22 జిల్లాలు అయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడి

హైదరాబాద్

ఎన్నికల కోడ్ ముగుస్తుండడంతో పాలనపై దృష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. తమ ప్రభుత్వం రాగానే తెలంగాణలో జిల్లాల సంఖ్య తగ్గిస్తానని గతంలో హామీ ఇచ్చిన ఆయన, ఇప్పుడు ఇదే అంశంపై సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. గతంలో కేసీఆర్ పరిపాలనా సౌలభ్యం కోసం ఉమ్మడి 10 జిల్లాల సంఖ్యను 33 జిల్లాలుగా మార్చారు. అయితే, ఈ విభజన శాస్త్రీయంగా జరగలేదని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఆరోపిస్తూ వచ్చింది. కొన్ని ప్రాంతాలలో ఒక్కో జిల్లాను 5 ముక్కలుగా చేయడంతో పాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు సైతం మొత్తుకున్నారు. అందుకు సంబంధించి అప్పటి కేసీఆర్ సర్కార్‌కు నివేదికలు సైతం అందజేశారు. అయితే, గత ప్రభుత్వ కాలంలో పనిచేసిన కొందరు పెద్దలు కేసీఆర్‌ను తప్పుదోవ పట్టించారని, వాళ్ల డిమాండ్‌కు తలొగ్గిన కేసీఆర్ తీసుకున్న తొందరపాటు నిర్ణయమే దీనికి కారణంగా కొందరు బాహాటంగానే విమర్శించారు. 33 జిల్లాలకు సంబంధించి నిధుల సమస్య కూడా ఎదురవుతోందని ప్రస్తుత ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డికి ఇప్పటికే నివేదికలు అందించారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ఓ కమిషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటికే ఈ విషయమై రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఎన్నికల కోడ్ ముగియగానే యుద్ధ -మిగతా3లో




# పదేళ్లకు మోక్షం!

- రేషన్ కార్డులకు లైన్ క్లియర్?
- కొత్త రేషన్ కార్డుల కోసం లక్షలాది మంది ఎదురు చూపు
- తెలంగాణ సర్కార్ త్వరలో కీలక ప్రకటన చేసే అవకాశం
- గత కొన్నేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు లేక ఇబ్బందులు
- త్వరలోనే కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నట్లు ఇటీవల మంత్రి పొంగులేటి వెల్లడి
- రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఆయన హామీ



హైదరాబాద్

తెలంగాణలో దాదాపు పదేళ్ల తర్వాత కొత్త రేషన్ కార్డులకు మోక్షం లభించేలా కనిపిస్తోంది. తెలంగాణలో 2014నుంచి రేషన్ కార్డుల జారీ నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో జనాల్లో కొత్త ఆశలు చిగురించాయి. పెండింగ్‌లో ఉన్న కార్డుల్ని మంజూరు చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు పెరుగుతున్నాయి. 6 గ్యారంటీలతో పాటు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ. సంక్షేమ పథకాల అమలులో రేషన్ కార్డు పాత్ర కీలకం కాబోతోంది. మహిళలకు రూ. 2500, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు రూ.5లక్షలు, రూ.10లక్షల ఆరోగ్యబీమా పథకానికి రేషన్ కార్డు కంపల్సరీ. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలనే ఆలోచనలో ఉంది రేవంత్ సర్కారు. తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు. గత -మిగతా3లో



## ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యం లేకుండా చూస్తాం
- వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొంటున్నాం
- తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని గత ప్రభుత్వం కొనలేదు
- చివరిగింజ వరకు కొనుగోలు చేస్తాం.. రైతులు ఆందోళన చెందవద్దు
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్

ధాన్యం సేకరించిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని గత ప్రభుత్వం కొనలేదని, తాము వర్షాలకు తడిచిన ధాన్యం కూడా -మిగతా3లో

## ఇది ప్రజా పాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన..

- ఓట్ల నాడు ఒక మాట.. నాట్ల నాడు మరో మాట
- ప్రచారంలో ప్రతి గింజకు అని ఊదరగొట్టి.. ప్రభుత్వంలోకి రాగానే చేతులెత్తేస్తారా??
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- అసెంబ్లీ ఎన్నికల ముందు వరిపంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారని, ఇప్పుడు సన్నవడ్లకే అంటున్నారు
- కాంగ్రెస్ మార్కు మోసం, దగా, నయవంచన



హైదరాబాద్ /నల్లగొండ

ఇది ప్రజా పాలన కాదు అని, రైతు వ్యతిరేక పాలన అని, నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారని, ఇప్పుడు కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. కెటిఆర్ తన ట్విట్టర్ లో ట్వీట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వరిపంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారని, ఇప్పుడు సన్నవడ్లకే అన్నడంతో కపట కాంగ్రెస్ -మిగతా3లో



## వికసిత్ భారత్ సాకారం కావాలంటే ఆ రాష్ట్రాల అభివృద్ధి కీలకం

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిషా వంటి తూర్పు రాష్ట్రాలను దేశానికి వృద్ధి కేంద్రాలుగా మార్చాలి
- 2005కు ముందు ఆటవిక పాలనతో బిహార్ వృద్ధి దారుణంగా దెబ్బతిన్నది

## నెలాఖరి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయండి

- రైతుల ఇబ్బందులు పడకుండా చూడండి..
- తడిసిన ధాన్యాన్ని కొనండి..
- కొనుగోళ్లను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేస్తూ రైతులకు వెంటనే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



హైదరాబాద్

మే 31వ తేదీలోగా వరి ధాన్యం కొనుగోళ్లను కంప్లీట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతి కుమారి, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మిగిలిపోయిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు -మిగతా3లో

# ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఐసీసీ అరెస్ట్ వారెంట్?

హమాస్ అంతమే తమ లక్ష్యమని, వారిని సమూలంగా తుడిచిపెట్టేదాకా గాజాలో యుద్ధం ఆగదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ఇప్పటికే పలుమార్లు తేల్చిచెప్పారు. గడిచిన ఏడు నెలలుగా గాజాలో ఆ దేశ సైన్యం దాడులు చేస్తూనే ఉంది. ఈ దాడుల్లో పౌరులు వేలాదిగా చనిపోవడంపై అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అటు హమాస్ లీడర్ యహ్యా సిన్వర్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నారని, అమాయక పౌరుల మరణాలకు కారణమవుతున్నారని పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టినట్లు ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్ వెల్లడించారు. యుద్ధ నేరాలకు సంబంధించి నెతన్యాహుకు అరెస్ట్ వారెంట్ జారీ చేసే అంశాన్ని ఐసీసీ జడ్జిల బృందం పరిశీలిస్తోందని, త్వరలో వారెంట్ జారీ చేసే అవకాశం ఉందని ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ చెప్పారు. నెతన్యాహుతో పాటు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గాలంట్, హమాస్ లీడర్ యహ్యా సిన్వర్, మొహమ్మద్ డెయిఫ్, ఇస్మాయిల్ హనీయహ్ లకు వారెంట్ జారీ చేయనుందని తెలిపారు. అయితే, ఇలాంటి విషయాలపై నిర్ణయం తీసుకునేందుకు ఐసీసీ జడ్జిలు కనీసం రెండు నెలల సమయం తీసుకుంటారని పేర్కొన్నారు.

**వారెంట్ జారీ చేస్తే ఏం జరగనుంది..**

ఐసీసీలో ఇజ్రాయెల్ సభ్య దేశం కాదు కాబట్టి అరెస్ట్ వారెంట్ జారీ చేసిన వెంటనే నెతన్యాహుకు కానీ, గాలంట్ కు కానీ తక్షణం వచ్చిపడే ఇబ్బందేమీ లేదు. అయితే, విదేశాలకు




ప్రయాణించడం మాత్రం ఇద్దరికీ కష్టతరం కానుంది. ఐసీసీ సభ్య దేశాల్లో అడుగుపెడితే అరెస్టు చేసే అవకాశం ఉంది కాబట్టి విదేశీ ప్రయాణం ఇబ్బందికరంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. కాగా, గాజాలో యుద్ధ నేరాలకు పాల్పడ్డామనే ఆరోపణలను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఖండించారు. కరీం ఖాన్ ఆరోపణలు తనతో పాటు ఇజ్రాయెల్ ఆర్మీకి, ఇజ్రాయెల్ పౌరులపై దాడిగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ కూడా నెతన్యాహుకు మద్దతుగా నిలిచారు. ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్ వ్యాఖ్యలను కొట్టిపారేశారు.

# కోర్టు ఉత్తర్వులు లేకుండానే విపక్ష నేతలను జైల్లో పెడుతున్నారు

జార?ండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌ను ఏ కోర్టు దోషిగా నిర్ధారించకపోయినా ఆయనను జైలులో ఎందుకు ఉంచారని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మోదీ సర్కార్‌ను నిలదీశారు. దర్యాప్తు జరుగుతున్న సమయంలో సొరెన్‌ను నిర్బంధించారని అన్నారు. ఇది మోదీ గూండాగిరీ కాదా అని ప్రశ్నించారు. జార?ండ్‌లోని జంషెడ్‌పూర్‌లో సోమవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన ర్యాలీని ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడారు. తనకు వ్యతిరేకంగా ఏ కోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోయినా తనను జైలుపాలు చేశారని మండిపడ్డారు. రేపు మరొకరు ఎవరినైనా జైల్లో పెట్టవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. జార?ండ్‌లోని మొత్తం 14 స్థానాలనూ విపక్ష ఇండియా కూటమి గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక జంషెడ్‌పూర్‌లో సభ ముగిసిన అనంతరం సభా స్థలిలో ఏర్పాటు చేసిన డ్రమ్స్‌ను కేజ్రీవాల్ మోగించారు.

**ఢిల్లీ ప్రజలు పాకిస్థానీయుల్లా కనిపిస్తున్నారా?...**

**అమిత్‌షాను నిలదీసిన కేజ్రీవాల్**

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఢిల్లీ ముఖ్యమంత్రి ఆరవింద్ కేజ్రీవాల్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. నరేంద్ర మోదీ వారసుడిగా అమిత్‌షా ఎన్నికైన కారణంగానే ఆయన 'దురహంకారం' ప్రదర్శిస్తున్నారని తాజాగా కేజ్రీవాల్ ఆరోపించారు. ఢిల్లీ ప్రజలను పాకిస్థానీయులతో అమిత్‌షా



పోలుస్తున్నారని అన్నారు. కేజ్రీవాల్, రాహుల్ వంటి నేతలు ఇండియా కంటే పాకిస్థాన్‌నే ఎక్కువగా సపోర్ట్ చేస్తున్నారంటూ దక్షిణ ఢిల్లీలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కేజ్రీవాల్ మంగళవారంనాడు తిప్పికొట్టారు. అమిత్‌షా సోమవారంనాడు ఢిల్లీకి వచ్చారని, ఆయన ర్యాలీకి 500 మంది కంటే తక్కువ మంది హాజరయ్యారని అన్నారు. అమిత్‌షా తన ప్రసంగంలో దేశ ప్రజలపై నోరుపారేసుకున్నారని, ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతిచ్చేవారు పాకిస్థానీయులంటూ మాట్లాడారని చెప్పారు. "ఆయనను నేను ఒక్కటే అడగదలచుకున్నాను. ఢిల్లీ ప్రజలు 62 సీట్లు మనకు (ఆప్) ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 56 శాతం ఓటింగ్ షేర్ ఇచ్చారు. వాళ్లంతా పాకిస్థానీయులా?" అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. పంజాబ్ ప్రజలు 117 సీట్లలో 92 సీట్లు ఆప్‌కి ఇచ్చారనీ, వారు పాకిస్థానీయులా అని నిలదీశారు. గుజరాత్, గోవా, ఉత్తరప్రదేశ్, అసోం, మధ్యప్రదేశ్ సహా దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రజలు ఆప్‌ను ఆదరించారనీ, వారు కూడా పాకస్థానీయులేనా అని అమిత్‌షాను కేజ్రీవాల్ ప్రశ్నించారు.

**'ఇండియా' కూటమిదే అధికారం**

అమిత్‌షాను తన వారసుడిగా మోదీ ఎన్నుకున్నారని కేజ్రీవాల్ పునరుద్ఘాటించారు. "ఇదేదో గర్వకారణంగా మీరు (అమిత్‌షా) భావిస్తున్నారు. ప్రజలను తప్పుపడుతూ వారిని బెదరిస్తున్నారు. మీరింకా ప్రధాని కాలేదు. కానీ అహంకారంతో మాట్లాడటం మొదలుపెట్టారు. కానీ, మీరు ప్రధానమంత్రి కాబోవడం లేదని నేను చెప్పదలచుకున్నాను. ఎందుకంటే జూన్ 4వ తేదీన కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం లేదు" అని కేజ్రీవాల్ అన్నారు. సోమవారంనాడు పూర్తయిన 5వ విడత పోలింగ్ తర్వాత కేంద్రంలో 'ఇండియా' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని సర్వేలన్నీ చెబుతున్నాయని అన్నారు. బీజేపీకి ఓటమి తప్పదని, ఇండియా కూటమికి 300కు పైగా సీట్లు వస్తాయంటూ సర్వేలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.

# ఇండి' కూటమి పాపాలతో దేశం పురోగమించ లేదు

**ఈస్ట్ చంపరాన్:** విపక్ష పార్టీల సారథ్యంలోని 'ఇండియా' కూటమిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. 21వ శతాబ్దపు భారతదేశాన్ని 'ఇండి' కూటమి పాపాలు ముందుకు తీసుకువెళ్లలేవని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఆరో విడత ప్రచారంలో భాగంగా బీహార్ (%దీఅష్ఘుతీ%)లోని ఈస్ట్ చంపరాన్‌లో మంగళవారంనాడు జరిగిన ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, టుక్డే టుక్డే గ్యాంగ్‌పై జూన్ 4న కీలక నిర్ణయం రాబోతోందన్నారు. ఇంతవరకూ జరిగిన ఐదు విడతల పోలింగ్‌లో 'ఇండి' కూటమి పూర్తిగా ఓటమిపాలైందన్నారు. ఇండియా కూటమి పాపాలతో 21వ శతాబ్దపు భారతదేశం పురోగమించలేదని, ఆ కారణంగానే ప్రతి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, ఆర్జేడీ వంటి పార్టీలకు గట్టి గుణపాఠం చెబుతున్నారని అన్నారు.

**60 ఏళ్లపాటు దేశాన్ని కాంగ్రెస్ పతనం చేసింది**



కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీలు దేశాన్ని 60 ఏళ్ల పాటు ధ్వంసం చేశాయని, మూడు, నాలుగు తరాల జీవితాలను నాశనం చేశాయని మోదీ విమర్శించారు. "60 ఏళ్లలో ఈ వ్యక్తులు భారీ ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. స్విస్ అకౌంట్లు తెరిచారు. మీ పిల్లలకు చదువుకునేందుకు స్కూళ్లులేవు. వారి పిల్లలు మాత్రం విదేశాల్లో చదువులు కొనసాగించారు. పేదల కష్టాల పాలయ్యారు" అని అన్నారు.

**మోదీ బెడ్ రెస్ట్ కామెంట్‌పై...**

ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌పై ప్రధానమంత్రి మోదీ పరోక్ష విమర్శలు చేస్తూ, జూన్ 4 తర్వాత మోదీ బెడ్ రెస్ట్ తీసుకుంటారని ఇక్కడ ఒకరు అన్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే దేశంలోని ఏ ఒక్కరూ తమ జీవితంలో బెడ్ రెస్ట్ తీసుకోకూడదని తాను భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. దేశ ప్రజలంతా పూర్తి శక్తిసామర్థ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. "జంగిల్ రాజ్ వారసుల నుంచి ఇంతకంటే ఏమి ఆశిస్తాం. మోదీని ఆడిపోసుకోవడం మినహా ఈ ఎన్నికల్లో వాళ్లు మాట్లాడేందుకు ఎలాంటి అంశాలు లేవు" అని మోదీ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఏడు విడతల లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆరో విడత పోలింగ్ జూన్ 25న జరుగనుంది.

# సింగపూర్ ఎయిర్ లైన్స్ విమానంలో తీవ్ర కుదుపులు... ఒకరి మృతి

**లండన్ నుంచి సింగపూర్ వెళుతున్న బోయింగ్ విమానం**


**ఎయిర్ టర్బులెన్స్ కు గురైన ప్లేన్**

**పెనుగాలులకు ఊగిపోయిన వైనం**

**ఒకరి మృతి... 30 మందికి గాయాలు**

**బ్యాంకాక్ లో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్**

సింగపూర్ ఎయిర్ లైన్స్ విమానం అనూహ్య రీతిలో తీవ్ర కుదుపులకు గురికాగా, ప్రయాణికుల్లో ఒకరు మృతి చెందారు. ఈ విమానం లండన్ నుంచి సింగపూర్ వెళు తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో మరో 30 మందికి గాయాలయ్యాయి. ఎయిర్ టర్బులెన్స్ కు గురైన ఈ బోయింగ్ విమానాన్ని థాయ్ లాండ్ రాజధాని బ్యాంకాక్ లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 211 మంది ప్రయాణికులు, 18 మంది సిబ్బంది ఉన్నారు. కాగా, మృతి చెందిన ప్రయాణికుడి కుటుంబానికి సింగపూర్ ఎయిర్ లైన్స్ సంతాపం తెలియజేసింది. విమానాలు గాల్లోకి లేచాక, గరిష్ఠ ఎత్తుకు చేరిన తర్వాత, వాయు పీడనాల్లో మార్పు కారణంగా తీవ్రమైన కుదుపులకు గురవుతాయి. దీన్నే ఎయిర్ టర్బులెన్స్ అంటారు. వాతావరణ మార్పుల కారణంగా గాలి ప్రవాహం ఒక్కసారిగా దిశను మార్చుకుంటుంది. భిన్న దిశల నుంచి వీచే పెనుగాలులకు విమానం తీవ్రంగా ఊగిపోతుంది. ఈ కుదుపులు ఒక్కోసారి కొన్ని నిమిషాల పాటు కొనసాగుతాయి.



## గుజరాత్‌లో ఐసీఐసీ కలకలం

**గాంధీనగర్ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నలుగురు ఉగ్రవాదులను కేంద్ర నిఘా సంస్థ అరెస్ట్ చేసింది. ముందుగా విమానాశ్రయంలో ఉన్నారని గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌కు సమాచారం అందగా..విమానాశ్రయానికి చేరుకుని ముమ్మరంగా సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో నలుగురు ఎూఎూ ఉగ్రవాదులను యాంటీ టెర్రరిజం స్క్వాడ్ గుర్తించి అరెస్ట్ చేసింది. విచారణలో, మొత్తం నలుగురు శ్రీలంకకు చెందినవారు. చెన్నై నుంచి అహ్మదాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. పాకిస్థాన్‌లోని తమ భాగస్వాముల నుంచి సమాచారం కోసం వారు ఎదురుచూస్తున్నట్లు సమాచారం. వారి ఉద్దేశ్యాన్ని తెలుసుకోవడానికి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ప్రస్తుతం రహస్య ప్రదేశంలో దర్యాప్తు చేస్తోంది. వారి ప్రయోజనం ఏమిటి? అనే విషయాలను తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## లేటెస్ట్ టెక్నాలజీ ప్రభావంపై జెఫ్రీ హింటన్ హెచ్చరిక

**ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయి**

**మానవాళి విధ్వంసానికి ఏఐ దారితీస్తుంది**

**న్యూ ఢిల్లీ :** మరికొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక ఏఐ గాడ్‌ఫాదర్లలో ఒకరిగా చెబుతున్న జెఫ్రీ హింటన్ గత ఏడాదిగా లేటెస్ట్ టెక్నాలజీ ప్రభావంపై హెచ్చరిస్తున్నారు. ఏఐతో పొంచిఉన్న ముప్పుపై హింటన్ ఇటీవల మరోసారి తన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయని హెచ్చరించింది. 2022లో చాట్‌జీపీటీ లాంఛ్ అనంతరం ఇంటరాక్టివ్ ఏఐ చాట్‌బాట్స్‌పై టెక్ ప్రపంచంలో హాట్ డిబేట్ సాగింది. చాట్‌జీపీటీకి విశేష ఆదరణ లభించడంతో ప్రమోటింగ్ కంపెనీ ఓపెన్‌ఏఐ, కంపెనీ సీఈవో సాం ఆల్ట్‌మాన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఆపై చాట్‌జీపీటీ ప్రాచుర్యం పొందడంతో పలు టెక్ దిగ్గజ కంపెనీలు తమ సొంత చాట్‌బాట్‌లను లాంఛ్ చేశాయి. ఇక ఏఐతో నూతన అవకాశాలు ముందుకొస్తాయని, మానవులకు తమ దైనందిన జీవితంలో ఏఐ సాయపడుతుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయని, దీనిపైనే తాను కలత చెందుతున్నానని ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన చెప్పుకొచ్చారు. అయితే నూతన టెక్నాలజీ ఉత్పాదకతను పెంచి సంపదను సృష్టించినా అది తిరిగి సంపన్నుల చేతికి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఏఐతో ప్రపంచానికి మేలు చేకూరి సంపదను సమకూర్చినా అది ఈ టెక్నాలజీతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి, సామాన్యులకు చెందకుండా కేవలం డబ్బున వారి చేతుల్లోకే వెళుతుందని, ఇది సమాజానికి చేటు చేస్తుందని చెప్పారు. ప్రజలకు కనీస రాబడిని ప్రభుత్వం సమకూరిస్తే ఏఐ కారణంగా వారు ఇబ్బందులకు లోనుకాకుండా చూడవచ్చని హింటన్ సూచించారు. తనను సంప్రదించిన అధికారులు, పాలక వర్గాలకు తాను ప్రజలకు కనీస ఆదాయ పథకం గురించి ప్రతిపాదించానని, ఇది సరైన ఆలోచన అని వారికి చెప్పానని హింటన్ వివరించారు.

## వికసిత్ భారత్ సాకారం కావాలంటే ఆ రాష్ట్రాల అభివృద్ధి కీలకం




తూర్పు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆమె పట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలిచే క్రమంలో బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిషా వంటి తూర్పు రాష్ట్రాలను దేశానికి వృద్ధి కేంద్రాలుగా మార్చాలని కేంద్రం యోచిస్తోందని చెప్పారు. 2005కు ముందు ఆటవిక పాలనతో బిహార్ వృద్ధి దారుణంగా దెబ్బతిన్నదని నిర్మలా సీతారామన్ అన్నారు. 1991లో బిహార్‌లో తలసరి ఆదాయం రూ. 21,282 కాగా, జంగిల్ రాజ్ హయాంలో అది 33 శాతం పతనమై రూ. 14,209కి పడిపోయిందని వివరించారు. 2019 నాటికి బిహార్ తలసరి ఆదాయం ఏటా 5 శాతం వృద్ధితో రూ. 37,000కు చేరిందని చెప్పారు. జంగిల్ రాజ్‌లో దుష్పరిపాలన లేకుండా పాలన సజావుగా ఉంటే బిహార్ తలసరి ఆదాయం 2019 నాటికి రూ. 95,330కి చేరిఉండేదని మంత్రి పేర్కొన్నారు.


## ఇండియా కూటమి గెలిస్తే రైతులు, పేదలు, గ్రామీణుల రుణాల మాఫీ

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాషాయ పార్టీ లక్ష్యంగా సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. గత పదేండ్ల బీజేపీ హయాంలో పారిశ్రామికవేత్తల రుణాలు రూ. 25 లక్షల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. యూపీలోని అజాంఘఢ్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జూన్ 4 తర్వాత బీజేపీ బడా పారిశ్రామికవేత్తల రుణాలను మాఫీ చేస్తుందని, అయితే విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పారిశ్రామికవేత్తల రుణాలు కాకుండా పేదలు, రైతులు, గ్రామాల్లో నివసిస్తున్న సామాన్యుల రుణాలను మాఫీ చేస్తామని అఖిలేష్ యాదవ్ హామీ ఇచ్చారు. కాషాయ పాలనలో బడా పారిశ్రామికవేత్తలు, సంపన్నులకే మేలు జరిగిందని అన్నారు. ప్రధాని మోదీ తనకు సన్నిహితులైన పారిశ్రామిక దిగ్గజాలకు దేశ సంపదను దోచిపెట్టారని విమర్శించారు. యూపీలో కాంగ్రెస్, ఎస్పీ కూటమికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు.



## చేసిన పనుల ఊసెత్తకుండా కాంగ్రెస్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు


బీజేపీ పదేండ్ల హయాంలో చేపట్టిన పనుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడటం లేదని, ఆయన కాంగ్రెస్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖర్గే సోమవారం చండీఘఢ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరియాణ సంపన్న రాష్ట్రమైనప్పటికీ ఇక్కడ నిరుద్యోగం, ధరల మంటతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ఇక్కడి ప్రభుత్వం వద్ద వనరులు అపారంగా ఉన్నా రాష్ట్రం అప్పుల్లో మునిగిపోయిందని ప్రజలు మాట్లాడుతున్న పరిస్థితి నెలకొందని చెప్పారు. అభివృద్ధి బాటలో నడవడాన్ని హరియాణ ప్రభుత్వం విస్మరించిందని విపక్షాలపై బురదచల్లటంతోనే కాషాయ పాలకులు సమయం వృధా చేస్తున్నారని ఖర్గే మండిపడ్డారు.



# పదేళ్లకు మోక్షం!

-మొదటి పేజి తరువాయి

కొన్నేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడ్డారు. అయితే మీరు కూడా కొత్తరేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నట్లయితే మీకో శుభవార్త. కొత్త రేషన్ కార్డులపై తెలంగాణ సర్కార్ త్వరలో కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. అయితే ప్రకటన చేసినట్లయితే ఎంతో మందికి ఊరట కలుగనుందనే చెప్పాలి. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఎలాంటి కార్డులు జారీ కాలేదు. దీంతో ప్రజల నుంచి వ్యతిరేకత చాలా ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇటీవల తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ కొత్త రేషన్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టనుంది. అయితే ఎన్నికల కోడ్ ఉన్నందున కొత్త రేషన్ కార్డుల అంశం జాప్యమవుతోంది. కొత్త రేషన్ కార్డుల కోసం ఎంతగానో ఎదురు చూస్తున్న ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పే అవకాశాలు ఉన్నాయి. త్వరలో కొత్త రేషన్ కార్డులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలోనే కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నట్లు ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. తన సొంత నియోజకవర్గం పాలేరులో ప్రజల వద్దకే మంత్రి పొంగులేటి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పొంగులేటి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామని, కొత్త రేషన్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్లపై కూడా కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు త్వరలోనే




అర్హులు అందరికీ కొత్త పెన్షన్లు, పెంచిన పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఆయన తెలిపారు. దీంతో వీటన్నింటిపై రాష్ట్ర ప్రజలు ఎంతగానో ఆశలు పెట్టుకున్నారు. అలాగే పాలేరు నియోజకవర్గం తన సొంత ఇల్లు అని, ఎన్నికల కోడ్ ముగియగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలు పెడాతానని వెల్లడించారు. గతంలో వైట్, పింక్ రేషన్ కార్డులు ఉండేవి. 2014లో కేంద్ర ప్రభుత్వం పింక్ కార్డులను పూర్తిగా ఎత్తేసి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికే ఆహారభద్రత కార్డులు జారీ చేసింది. కేంద్రం జారీ చేసిన రేషన్ కార్డులు పొందలేని వారికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా ఆహారభద్రత కార్డులిచ్చింది. ఈ లెక్కన రాష్ట్రంలో 90.14 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉండగా, లబ్ధిదారుల సంఖ్య దాదాపు 2.83 కోట్లుగా ఉంది. రాష్ట్ర జనాభా 4 కోట్లు అనుకుంటే సుమారు 3 కోట్ల మంది ఆహారభద్రత కార్డులకు అర్హులుగా ఉన్నారు. కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాల్సి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విధివిధానాలు రూపొందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.

# ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం

-మొదటి పేజి తరువాయి

కొంటున్నామని, ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలు చెప్పడం బిఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని భట్టి చురకలంటించారు. 15 రోజులు ముందుగానే ధాన్యం కొంటున్నామని, గతంలో కంటే ఎక్కువగా 7215 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఎక్కువగా తాము ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరగకుండా చూస్తామని, చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని, ధైర్యంగా, నిశ్చింతగా ఉండాలని భట్టి స్పష్టం చేశారు. నేటి యువత సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, వాతావరణ శాఖ సూచనలను రైతులకు అందించాలని, వర్షసూచనపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. ధాన్యం సేకరించిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. వాతావరణ శాఖ సూచనలను రైతులకు ఎప్పటికప్పుడు అందజేయాలని అధికారులకు సూచించారు.

వర్ష సూచనపై రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తడిచిన ధాన్యం కూడా కొంటామని ఆయన తెలిపారు. ప్రతిపక్షాలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. అలాగే నేటి యువత సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కాగా, దొడ్డు వడ్ల బోనస్ గురించి ఎన్ని సార్లు అడిగినా డిప్యూటీ సీఎం మాట మార్చి సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటూ తెలిపారు.




# ఇది ప్రజా పాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన..

-మొదటి పేజి తరువాయి

మార్కు మోసం, దగా, నయవంచన బయటపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యారెంటీ కార్డులో అప్పుడు సన్న వడ్లకు మాత్రమే అని ఎందుకు చెప్పలేదని అడిగారు. ప్రచారంలో ప్రతి గింజకు అని ఊదరగొట్టి ప్రభుత్వంలోకి రాగానే చేతులెత్తేస్తారా ? అని చురకలంటించారు. కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసి ఆగం చేశారన్నారు." ప్రతి ఏటా రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు రైతుభరోసా ఇస్తాం, వ్యవసాయ కూలీలకు రూ.12000 వేలు ఇస్తాం, ప్రతి రైతుకు డిసెంబర్ 9న రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎందుకు చేయలేదు" అని కెటిఆర్ చురకలంటించారు. నేడు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయటపెట్టారని దుయ్యబట్టారు. ఓట్ల నాడు ఒకమాట, నాట్ల నాడు మరోమాట చెప్పడమే కాంగ్రెస్ నైజమని, అసెంబ్లీ ఎన్నికల్లో గాలిమాటలతో గారడీ చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు డబ్బాలో పడగానే.. నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా తన నిజస్వరూపాన్ని బయటపెట్టిందని, ఎద్దేడ్సిన యవుసం, రైతేడ్చిన రాజ్యం నిలబడదని, నమ్మి ఓటేసినందుకు రైతుల గొంతు కోసిన కాంగ్రెస్ సర్కారును అన్నదాతలు ఇక వదిలిపెట్టకుండా పల్లె పల్లెనా ప్రశ్నిస్తారని, తెలంగాణ వ్యాప్తంగా నిలదీస్తారని, కపట కాంగ్రెస్ పై సమరశంఖం పూరిస్తామని, నేటి నుంచి రైతన్నల చేతిలోనే కాంగ్రెస్ సర్కారుకు కౌంట్ డౌన్ షురూ అయిందని కెటిఆర్ హెచ్చరించారు.

**2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి**



**ఊసే లేదు : కేటీఆర్**

**నల్లగొండ :** నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖమ్మం %-% వరంగల్ - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఖమ్మం - నల్లగొండ -వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 4 లక్షల 70 వేల మంది పట్టభద్రులు ఉన్నారు. మరి అరచేతిలో వైంకుఠం చూపెట్టి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా..? పదేండ్ల పాటు నిజాయితీగా పని చేసిన బీఆర్ఎస్‌కు ఓటెద్దామా..? ఒక గోల్డ్ మెడల్ సాధించి ప్రజాసేవకు అంకితమైన రాకేశ్ రెడ్డికి ఓటేద్దామా..? మీడియా, యూట్యూబ్ అడ్డం పెట్టుకుని దందాలు చేసే చీటర్లకు ఓటేద్దామా..? అనేది ఆలోచించాలని పట్టభద్రులకు కేటీఆర్ సూచించారు.

**మెగా డీఎస్సీ ముచ్చటనే లేదు..**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. జాబ్ క్యాలెండర్ లేదు. మెగా డీఎస్సీ ముచ్చటనే లేదు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ అంటున్నాడు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. ఉద్యోగాలు ఇచ్చామని డైలాగులు కొడితే నమ్మేందుకు మనం పిచ్చోళ్లామా..? కాంగ్రెస్ చెప్పిన 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు. మీ తరపున కొట్లాడాలి అంటే మాకు బలమివ్వాలి. కానీ బాకాలు ఊదేవాళ్లకు కాదు అని కేటీఆర్ చెప్పారు.

**ఐదు నెలల్లోనే ఐదేండ్ల అపఖ్యాతిని మూటగట్టుకుంది..**

ఈ ప్రభుత్వం ఐదు నెలల్లో అన్ని వర్గాలను మోసం చేసింది. ఐదు నెలల్లోనే ఐదేండ్ల అపఖ్యాతిని మూటగ్గటుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. బ్రహ్మాండంగా ఉన్న పరిస్థితిని చెడగొట్టుకున్నామని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పుడైనా ఆలోచించి ఓటేయండి.. ఆగం కాకండి. ఎవరి వల్ల లాభం జరుగుతదో ఆలోచించాలి. బ్లాక్ మెయిలర్లు, దందాలు చేసేటోళ్లకు అవకాశం ఇస్తే సమాజానికి తీవ్ర నష్టం. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్న సన్నాసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే గ్రాడ్యుయేట్లు సరైన తీర్పునివ్వాలి. ఈ ఎన్నికల్లో రాకేశ్ రెడ్డికి ఆశీర్వాదం ఇస్తే ప్రభుత్వం నిలదీసే అవకాశం ఉంటుంది అని కేటీఆర్ అన్నారు.

# అప్పు చెల్లించలేదనీ అమానుషం.. రైతు భార్య పిల్లలను తీసుకెళ్లి 2 రోజులుగా నరకం!

పొలం సాగు కోసం ఓ రైతు గ్రామంలోని ఓ మహిళ వద్ద అప్పు చేశాడు. అయితే తీవ్ర కరువు వల్ల పంట చేతికి రాకపోగా చేసిన అప్పు కొండలా పెరిగింది. దీంతో అప్పుఇచ్చిన మహిళ రైతు ఇంటికి వచ్చి నానాయాగి చేసింది. అతని భార్య, పిల్లలను తీసుకెళ్లి గృహనిర్భంధంలో ఉంచింది. గృహనిర్బంధంలో ఉంచిన భార్య, కొడుకులకు గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వకుండా నరకం చూపించింది. దీంతో వారిని విడిపించలేక, అప్పుకట్టలేక మనస్తాపం చెందిన రైతు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నాటక జిల్లాలోని హుక్కేరి తాలూకా ఇస్లాంపుర గ్రామంలో ఈ ఘోరం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. కర్నాటక జిల్లాలోని హుక్కేరి తాలూకా ఇస్లాంపుర గ్రామానికి చెందిన సిద్దవ బయ్యనవర అనే మహిళ వద్ద రాజు ఖోటాగి అనే రైతు ఐదు నెలల క్రితం రూ. లక్షన్నర అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పుకు గానూ నెలకు శాతం 10% మేర వడ్డీ కూడా వసూలు చేస్తూ వచ్చింది. రెండు రోజుల క్రితం సిద్దవ్వ హఠాత్తుగా రాజును ఇంటికి పిలిపించి అప్పు తిరిగి ఇవ్వాలని హెచ్చరించింది. దీంతో అప్పు చెల్లించేందుకు తనకు రెండ్రోజులు గడువు కావాలని కోరిన రాజు.. ఆ అప్పు సకాలంలో చెల్లించలేకపోయాడు. దీంతో అప్పుగా తీసుకున్న సొమ్ము చెల్లించేంత వరకు అతని కొడుకును తన ఇంట్లోనే వదిలిపెట్టాలని మహిళ కోరింది. దీంతో గత్యంతరంలేక ఆమె చెప్పిన విధంగా రాజు తన కుమారుడు బసవరాజ్‌ను ఆమె ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. మరుసటి రోజు కుమారుడిని చేసేందుకు వెళ్లిన రాజు భార్య దుర్గవ్‌ను కూడా సదరు మహిళ బలవంతంగా తన ఇంట్లో ఉంచింది. దీంతో



మనస్తాపానికి గురైన రాజు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజుకి అప్పు ఇచ్చిన సిద్దవ్వ 2 రోజులుగా చుక్క నీరు, పిడికెడు అన్నం కూడా ఇవ్వకుండా అతని భార్య, కొడుకులను గృహనిర్భంధం చేసింది. కసాయితనంగా రాజు భార్య దుర్గవ్వ, కుమారుడు బసవరాజుని సిద్దవ్వ గృహనిర్బంధంలో ఉంచినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులకు సిద్దవ్వపై ఫిర్యాదు చేసినా, కేసు నమోదు చేయలేదని.. ఉదయం నుంచి రాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లో పడిగాపులు కాసినట్లు దుర్గవ్వ, ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. అనంతరం యమకనమరడి పోలీస్ స్టేషన్‌లో దీనిపై కేసు నమోదైంది.

# 17 జిల్లాలా... 22 జిల్లాలా...

-మొదటి పేజి తరువాయి

ప్రాతిపదికన జిల్లాల కుదింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ఉమ్మడి ఏపీ నియోజకవర్గాల పునర్విభజన టైమ్‌లో అప్పటి సర్కార్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా అదే తరహాలో ఉన్నతాధికారులతో తెలంగాణలోనూ జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ కమిటీ ఇచ్చే గైడెన్స్ మేరకు జిల్లాల విభజనపై నిర్ణయం తీసుకోవాలని సీఎం భావిస్తున్నారు. జిల్లాల విషయంలో తమ ప్రభుత్వ ఆలోచనను అసెంబ్లీలో ప్రతిపాదించి సభ్యులతో చర్చించి అనంతరం కుదింపుపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పార్లమెంట్ నియోజకవర్గాలు 17. వాటికి డీలిమిటేషన్ ప్రకారం చూస్తే 1/3 జిల్లాలు పెరుగుతాయి. ఆ లెక్కన 17+6 =23 జిల్లాలు అవుతాయి. జనాభా లెక్కల ప్రకారం చేస్తే 22 జిల్లాలు అయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. జ్యుడీషియల్ కమిషన్ నివేదికతో పాటు నిధులకు అనుకూలంగా ఉండేలా చివరకు 22 లేదా 23 జిల్లాలను ప్రభుత్వం ఫైనల్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నాయి. కొందరు అధికారులు మాత్రం పార్లమెంట్ నియోజకవర్గాలు 17 ఉండగా దానికి అనుగుణంగా, 17 జిల్లాలను చేయాలని దానివల్ల నిధులకు, ఖర్చుకు కూడా ఇబ్బందులు ఉండవని పేర్కొంటుండగా జ్యుడీషియల్ నివేదికనే ఫైనల్ అని ప్రభుత్వం పేర్కొంటున్నట్టుగా తెలిసింది. రానున్న రోజుల్లో ఒకవేళ 17 జిల్లాలు చేస్తే గొడవలు జరిగే అవకాశం ఉందని, రాజకీయంగా పార్టీలకు నష్టం జరిగే అవకాశం ఉందని కూడా ఆ వర్గాలు పేర్కొంటుండడం విశేషం. అయితే, జ్యుడీషియల్ కమిషన్ నివేదిక వచ్చిన తరువాత దానిపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సీఎం నిర్ణయించినట్టుగా సమాచారం. కొత్తగా ఏర్పాటు చేసే ఒక జిల్లాకు (ఉమ్మడి వరంగల్ జిల్లాలోని) పీవీ నరసింహారావు పేరు పెడతామని, జనగామ జిల్లా పేరు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా మారుస్తామని ఇప్పటికే కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గత ప్రభుత్వం ఆసిఫాబాద్ జిల్లాకు గోండు వీరుడు కొమురం భీం పేరును పెట్టగా, కొత్తగూడెం జిల్లాకు పుణ్యక్షేత్రం భద్రాచలం పేరును, భూపాలపల్లి జిల్లాకు తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ పేరు, గద్వాల జిల్లాకు శక్తిపీఠం జోగులాంబ పేరు, భువనగిరి జిల్లాకు పుణ్యక్షేత్రం యాదాద్రి పేర్లను పెట్టింది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా రెండు జిల్లాల పేర్లను మార్చాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

## వర్షాకాలంలో శానిటేషన్‌పై అప్రమత్తంగా ఉండాలి

**వేసవిలో తాగునీటి సరఫరా సక్సెస్ పై మంత్రి అభినందన**

**రానున్నరోజుల్లో ఇలాగే పని చేయాలి**

**అధికారులకు పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క అదేశం**

**హైదరాబాద్ :** వేసవిలో ఇబ్బందులు లేకుండా అన్ని గ్రామాలకు, ఆవాసలకు తాగునీటి సరఫరా చేయడం పట్ల పంచాయతీరాజ్, మిషన్ భగీరథ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. సెక్రటేరియట్ లో పీఆర్, ఆర్డి, మిషన్ భగీరథ అధికారులతో మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా త్రాగునీటి సరఫరా అధికారుల పని తీరు అభినందనీయమని మంత్రి అన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే పనితీరు ప్రదర్శిస్తూ ప్రజలకు ఇబ్బంది పడకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో త్రాగునీరు కాలుష్యం కాకుండా, డ్రైనేజీ పైపులు లీకేజీ లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో గ్రామపంచాయతీల్లో శానిటేషన్ పై జాగ్రత్తగా ఉండాలని, డ్రైనేజీలు, రోడ్లపై నీళ్లు నిలవకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఈఎన్సిలు కృపాకర్ రెడ్డి, కనకరత్నం, కమిషనర్ అనిత రామచంద్రన్, విద్యాసాగర్, కాత్యాయని ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నెలాఖరి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయండి

-మొదటి పేజి తరువాయి



తరలించాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆదనపు కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధాన్యం కొనుగోళ్లపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోళ్లను జిల్లా కలెక్టర్లు వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోళ్లను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేస్తూ రైతులకు వెంటనే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వరి ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలని, రైతులకు నష్టం జరగకుండా చూడాలని తెలిపారు. వర్షానికి మొలకెత్తిన, తడిసిన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. మిల్లర్లతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

## యూ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు..

**మంత్రి ఉత్తమ్‌పై బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..**



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆర్ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో సీఎం, మంత్రులు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ లోక్ సభ ఎన్నికల ప్రచార వేళ ప్రధాని మోదీ సహా.. బిజేపి నేతలు సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. లోక్ సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి మరో బాంబ్ పేల్చారు. కొత్తగా రాష్ట్రంలో మరో ట్యాక్స్ వసూలు చేస్తున్నారంటూ కీలక మంత్రిపై సంచలన ఆరోపణలు చేశారు. మహేశ్వరరెడ్డి చేసిన కామెంట్స్ రాష్ట్రంలో సంచలనంగా మారాయి. రైతుల ధాన్యం కొనుగోలు రచ్చ కొనసాగుతున్న వేళ.. క్వింటాకు 10 నుంచి 12 కేజీలు అదనంగా జోకుతూ (తూకం) దోచుకుంటున్నారని బిజెఎల్పీ నేత మహేశ్వరెడ్డి ఆరోపించారు. ఏటా కొనుగోలు అయ్యే కోటి 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంతో పోల్చితే దాదాపు 13 వేల మెట్రిక్ టన్నులు దోచుకున్నట్లేనని.. ఇలా వందల కోట్ల రూపాయలు సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జేబుల్లోకి వెళ్లినట్లు మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇటీవల దాదాపు 500 కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించిన మహేశ్వరరెడ్డి.. సివిల్ సప్లై మినిస్టర్ గా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి అందులో వంద కోట్ల రూపాయలను ఢిల్లీకి ఎన్నికల ఖర్చు కోసం పంపినట్లు చెప్పారు. దీనిపై ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లతో మంత్రి ఉత్తమ్ కుమ్మక్కైయ్యారని.. తాను సీఎం రేసులో ఉన్నానని చెప్పుకోవాడని ఢిల్లీకి వంద కోట్లు పంపారని మహేశ్వరరెడ్డి ఆరోపించారు.

# 8,9 తేదీలలో చేపమందు

**హైదరాబాద్ :** ఈ ఏడాది చేప ప్రసాదం పంపిణీపై బత్తిని కుటుంబ సభ్యులు కీలక ప్రకటన చేశారు. జూన్ 8న శనివారం ఉదయం 11 గంటలకు మృగశిర కార్తె ప్రవేశిస్తుందని.. ఆ రోజునే చేప ప్రసాదం పంపిణీ చేస్తామని బత్తిని గౌడ్స్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జూన్ 8న ఉదయం 11 గంటల నుంచి జూన్ 9న ఉదయం 11 గంటల వరకూ పంపిణీ ఉంటుందని చెప్పారు. చేప ప్రసాదం కోసం వచ్చే వారి కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆస్తమా, ఉబ్బసం, దగ్గు వంటి శ్వాస సంబంధిత వ్యాధుల నివారణకు ఏటా దీన్ని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బత్తిని అమర్నాథ్ గౌడ్, ఇతర కుటుంబ సభ్యులు, శివశంకర్ గౌడ్, గౌరీశంకర గౌడ్, శివశేఖర్ గౌడ్, సంతోష గౌడ్, మౌళి గౌడ్, రోషన్ గౌడ్ పాల్గొన్నారు.దాదాపు రెండు శతాబ్దాలుగా తమ కుటుంబం చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు తెలిపారు. 'ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు మృగశిరా కార్తె ప్రవేశించిన ఘడియల్లో ఓ



పదార్థాన్ని చేప ద్వారా రోగి నోట్లో వేస్తాం. ఈ ప్రసాదాన్ని వ్యాధి తీవ్రతను బట్టి రోగి నాలుగు నుంచి ఐదు సంవత్సరాలు తీసుకుంటే పూర్తిగా నయం అవుతుంది. ఈ సేవ మా కుటుంబ పెద్దలకు 190 ఏళ్ల క్రితం ఓ మునీశ్వరుడు బోధించారు. అప్పటి నుంచి నిస్వార్థంగా ఉచితంగా లక్షలాది మంది శ్వాస సంబంధిత రోగులకు చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నాం. ఇప్పటివరకూ గత ప్రభుత్వాలన్నీ పూర్తి సహకారాన్ని అందిస్తూ అన్ని ప్రభుత్వ శాఖలు బాధ్యతగా ఏర్పాట్లు చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాని కోరాం. చేప ప్రసాదం పంపిణీకి ఎప్పటిలాగానే ఆర్టీసీ, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మున్సిపాలిటీ, పోలీస్ శాఖలతో పాటు మత్స్య శాఖను కావాల్సిన చేపల్ని సిద్ధం చేయాల్సిందిగా లిఖిత పూర్వకంగా సంప్రదించాం' అని బత్తిని అమర్నాథ్ గౌడ్ తెలిపారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ చేప ప్రసాదం ఎవరైనా తీసుకోవచ్చుని.. గర్భిణీలు మాత్రమే తీసుకోవద్దని బత్తిని కుటుంబ సభ్యులు సూచించారు. పరగడుపున లేదా భోజనం తీసుకున్న 3 గంటల తర్వాత చేప ప్రసాదం తీసుకోవాలని అన్నారు.చేప ప్రసాదం కోసం వేలాదిగా తరలివచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పంపిణీ సజావుగా సాగడానికి ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకొస్తున్నాయి. రోగులకు భోజనం, కాఫీ, టీ, టిఫిన్, మజ్జిగ, మంచినీరు అందిస్తామని అగ్రవాల్ సేవా దళ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చెప్పారు. క్యూ లైన్ లో రోగులు ఏ విధంగా ఇబ్బంది పడకుండా వాలంటీర్లు సేవలందిస్తారని చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో పంపిణీ రోజున దివ్యాంగులు, వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేక క్యూలైన్లు కౌంటర్లు ఉంటాయని తెలిపారు.

# తీన్మార్ మల్లన్నకు అంత ఈజీ కాదు

**వరంగల్ :** వరంగల్,ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తీన్మార్ మల్లన్నకు అంత ఈజీ కాదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన ఆయన తన ప్రత్యర్థుల నుంచి గట్టి పోటీనే ఎదుర్కొనున్నారు. బీఆర్ఎస్ నుంచి రాకేష్ రెడ్డి,కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్,నిరుద్యోగుల్లో విశేష ఆదరణ ఉన్న అశోక్ సార్ ల నుంచి తీన్మార్ మల్లన్నకు టఫ్ కాంపిటీషన్ ఉండనుంది. బిజెపి నుంచి బిఆర్ఎస్ లో చేరిన రాకేష్ రెడ్డి ఉన్నత విద్యావంతుడు. ఆయన బిట్స్ ఫీలాని విద్యార్థి. రాకేష్ రెడ్డి బిజెపి నుంచి బీఆర్ఎస్ లో చేరినప్పటికీ..ఆయనకు ఇప్పటికీ ఆ పార్టీ క్యాడర్లో సానుకూల అభిప్రాయమే ఉంది. దీంతోపాటు ఇటు బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకరిస్తే రాకేష్ రెడ్డి గట్టి పోటీనే ఇవ్వనున్నారు. మల్లన్నకు పోలయ్యే చాలా ఓట్లను రాకేష్ రెడ్డి చీల్చేసే అవకాశముంది.ఇక ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్నకు ఎంతో కొంత పోటీనిచ్చే క్యాండిడేట్ కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్. ఈయన తీన్మార్ మల్లన్న లాగే బీఆర్ఎస్ ప్రభుత్వంపై గట్టి పోరాటాలే చేశారు. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ కూతురు కవిత అక్రమాస్తులకు సంబంధించిన



వివరాలను బయటపెట్టి మంచి పేరు తెచ్చుకున్నారు. అంతేకాక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజా సమస్యలపై ప్రశ్నించడంలో వెనుకాడ లేదు. ఈ నేపథ్యంలోనే ఈయనకు యువత,పట్టభద్రుల్లో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఈయన కూడా ఈసారి గట్టి పోటీనే ఇవ్వనున్నారు. ఈయన కూడా మల్లనకు పోలయ్యే ఓట్లలో మెజార్టీ ఓట్లను చీల్చుకుంటారని అభిప్రాయం ఉంది.పట్టబదులే ఎమ్మెల్సీ బరిలో ఉన్న మరొక కీలక అభ్యర్థి అశోక్ సార్. ఈయన అశోక్ అకాడమీ పేరుతో ఎంతోమంది నిరుద్యోగస్తులకు సుపరిచితుడు. 46 జీవో పై తనదైన శైలిలో కార్యక్రమాలు కూడా చేపట్టారు. దీంతో పట్టభద్రులు,నిరుద్యోగులు, ఉపాధ్యాయ వర్గాల్లో ఈయన మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి వరంగల్,కరీంనగర్,ఖమ్మం గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అశోక్ సార్ గట్టిపోటినే ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా రాకేష్ రెడ్డి,బక్క జడ్సన్,అశోక్ సార్ ల రూపంలో తీన్మార్ మల్లన్నకు ప్రమాదం పొంచి ఉన్నట్లే అనిపిస్తుంది.అంతేకాక తీన్మార్ మల్లన్న అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్లోని కొందరు కీలక నేతలు కూడా తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. బయటకు చెప్పలేకున్నా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తంకుమార్ రెడ్డి మల్లన్న అభ్యర్థిత్వంపై గుస్సాగా ఉన్నారు . వీరితోపాటు మరికొందరు కాంగ్రెస్ ముఖ్య నేతలు తీన్మార్ మల్లన్న అభ్యర్థిత్వంపై అంతర్గతంగా అసంతృప్తిగానే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తీన్మార్ మల్లన్న గెలుపు అనేది అంత ఆషామాషి వ్యవహారం కాదని తేలిపోయింది.

# వరంగల్‌కు ఎయిర్ పోర్టు

**వరంగల్ :** దశాబ్దాలుగా వరంగల్ వాసులు ఆశగా ఎదురు చూస్తున్న కల నెరవేరనుంది. వరంగల్ విమానాశ్రయం నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తరవాత వరంగల్ విమానాశ్రయం వ్యవహారాలపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వరంగల్ ప్రాంతీయ విమానాశ్రయం విషయంలో కొంతకాలంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ సైలెంట్‌గా ఉంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో మాట్లాడుతూ.. వరంగల్ విమానాశ్రయాన్ని నిర్మించేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. దీంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై ఏఏఐ అధికారుల్లో కదలిక వచ్చింది. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సమీక్షించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం త్వరలో రాష్ట్రానికి రానున్నట్లు తెలుస్తోంది. వరంగల్‌లో ప్రస్తుతం ఎయిర్ స్ట్రిప్‌ను పరిశీలించి, ఉన్నతాధికారులతో చర్చలు నిర్వహించనున్నట్లు సమాచారం. అప్పుడు ఎయిర్ పోర్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమా? లేక మునుపటి ప్రభుత్వం నిర్ణయం ప్రకారం దశల వారీగా అభివృద్ధి చేస్తారా అనేది తేలనుంది. వరంగల్ ఎయిర్‌పోర్ట్స్ నిర్మాణానికి 706 ఎకరాల భూమిని కేటాయించారు. దానికి అదనంగా మరో 253 ఎకరాలు కేటాయిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్‌కు ముందు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాదు హైదరాబాద్ జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కూడా అనుమతులు తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వం నుంచి వచ్చిన భూమి కేటాయింపు ఉత్తర్వులతో ఏఏఐ అధికారులు వరంగల్‌లో పర్యటించారు. విమానాశ్రయం నిర్మాణం, అక్కడి పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. దాని తరువాత ఏఏఐ అధికారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఎలాంటి సమాచారం లేదు. దీంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై అయోమయం నెలకొంది. విమానాశ్రయ



నిర్మాణం కోసం పరిశీలన చేశారా? లేక మరేదైనా కారణాలతో సర్వే చేశారా? అనే విషయంపై ప్రస్తుత ప్రభుత్వానికి స్పష్టత రావాల్సి ఉంది. వరంగల్ విమానాశ్రయాన్ని దశల వారీగా విస్తరించాలని గతంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ఏటీఆర్ స్థాయి చిన్న విమానాల రాకపోకలు సాగించేలా ఎయిర్‌పోర్ట్ నిర్మించాలనుకున్నారు. ఇందు కోసం 253 ఎకరాలను కేటాయించింది. అయితే ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కనీసం 400 ఎకరాలు కావాలని ఏఏఐ అధికారులు తమ నివేదికలో వెల్లడించారు. అలాగే విస్తరణకు సుమారు రూ.1,200 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే అంత మొత్తాన్ని ఖర్చు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ సమయంలో ఆసక్తి చూపలేదని ఏఏఐ అధికారులు తెలిపారు.అయితే వరంగల్ విమానాశ్రయంలో రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్లతో విమానాల రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని, ఇందుకు అణుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సూచించింది. కానీ దానిని నిపుణులు వ్యతిరేకించారు. ఒకేసారి నిర్మాణాన్ని చేపడితే అన్ని రకాలుగా ప్రయోజన కరంగా ఉంటుందని సూచించారు. అంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆ విషయం కాస్తా అటకెక్కింది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి స్పందించడంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణం అంశం తెరపైకి వచ్చింది. విమానాశ్రయ నిర్మాణానికి రేవంత్ సర్కార్ సుముఖత వ్యక్తం చేసినా అది ఏ స్థాయిలో ఉంటుందో తెలియాల్సి ఉంది.

# కేటీఆర్... ఇంకా... ఇంకా...

**కరీంనగర్ :** ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కె.తారక రామారావు ఇంకా ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల పూర్తాయి దాదాపు ఏడు నెలలు కావస్తున్నా.. మేము ప్రచారంలో కొన్ని మెలుకువలు పాటిస్తే గెలిచే వారిమేమోననే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్,కరీంనగర్,ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.ఈ సందర్భంగా కేటీఆర్ పలు ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దఫాల్లో అనేక కీలకమైన పథకాలను అమలు చేసిందన్నారు. రైతు బంధు,రైతు రుణమాఫీ,కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్,రైతు భరోసా,రైతులకు ఇన్సూరెన్స్, చేనేతకు చేయూత, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, పల్లె, పట్టణ ప్రగతి, ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజ్ స్థాపన, ప్రతీ నియోజకవర్గానికి మెరుగైన గురుకులాలు వంటి అనేక స్కీమ్స్, అభివృద్ధి పనులను తమ సర్కార్ ఇంప్లిమెంట్ చేయగలిగిందన్నారు.అయితే తమ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాల గురించి గత శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రజలకు స్పష్టంగా వివరించడంలో బీఆర్ఎస్ పార్టీ విఫలమైందనే అభిప్రాయాన్ని ఆయన ఇప్పటికీ వెలిబుచ్చడం విస్మయం కలిగిస్తోంది. ఇలాంటి ప్రకటనలు చేయడం ద్వారా కేటీఆర్ లో ఉన్న అధికార దాహం ఇంకా పోనట్లే అర్థమవుతుంది. అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకనే ఆయన ఈ రకమైన స్టేట్మెంట్లు ఇస్తున్నట్లు..తెలుస్తోంది. అందుకే ఈసారి లోక్సభ ఎన్నికల్లో గనుక బీఆర్ఎస్కు పూర్తి వ్యతిరేకమైన ఫలితాలు వస్తే ఆయన అసలు తట్టుకోలేరని విమర్శకులు అంచనా వేస్తున్నారు.

## కేటీఆర్ ఓటుపై వేటా...

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందింది. తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో నందిని నగర్‌లో ఆయన ఓటు వేసిన తర్వాత మీడియాతో మాట్లాడారు. ఆ సందర్భంగా చేసిన కొన్ని వ్యాఖ్యలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నాయని కాంగ్రెస్ నాయకుడు నిరంజన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఈసీ తాజాగా స్పందించింది. వెంటనే ఈ అంశంపై యాక్షన్ తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ లేదా జిల్లా ఎన్నికల అధికారికి మెమో జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌పై కేసు నమోదుకు రంగం సిద్ధం అవుతున్నది.నందిని నగర్‌లో కేటీఆర్ ఓటు వేసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. 'తెలంగాణ తెచ్చిన పార్టీకి, తెలంగాణ సాధించిన నేతకు ఓటు వేశాను. మీరందరు కూడా ఓటు వేయాలని కోరుతున్నాను' అని కామెంట్ చేశారు. ఈ వ్యాఖ్యలు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తాయని కాంగ్రెస్ నేత నిరంజన్ ఫిర్యాదు చేశారు. కేటీఆర్‌పై తాను చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేయాలని కోరారు. ఎన్నికల సంఘం దర్యాప్తులో వాస్తవాలు తెలిస్తే కేటీఆర్ ఓటు చెల్లదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. నిజంగానే కేటీఆర్ వేసిన ఓటు చెల్లకుండా పోతుందా? అనేది తెలియాలంటే ఈసీ దర్యాప్తు పూర్తయ్యే వరకు వేచి చూడాల్సిందే. పోలింగ్ రోజున బీజేపీ నాయకురాలు మాధవీలత, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సహా పలువురు నాయకులపై కేసులు నమోదయ్యాయి. తాజాగా కేటీఆర్‌పైనా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందింది.

## కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

## పంచాయితీ పెద్దగా రేవంత్

**హైదరాబాద్ :** మాజీ మంత్రి మల్లారెడ్డి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి మధ్య భూపంచాది సంచనంగా మారింది. మల్లారెడ్డి ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి.. అడ్లూరి అనుచరులు సుచిత్రలోని సర్వేనెంబర్ 82కు సంబంధించిన భూమిలో ఘర్షణకు దిగడం రాజకీయంగా హాట్ టాపిక్ అయింది. ఈ భూమి తమదంటే తమదని రెండు వర్గాలు మీడియా వేదికగా ప్రెస్ మీట్ లు పెట్టి రచ్చ రచ్చ చేసేశాయ్. ఈ భూమిని తాను 2015 లోనే కొనుగోలు చేసి కబ్జాలో ఉన్నట్లు మల్లారెడ్డి చెబుతుండగా.. అడ్లూరు మాత్రం తాను మరి కొంతమంది పార్ట్నర్స్ తో కలిసి కొనుగోలు చేసిన ఈ ల్యాండ్ ను మల్లారెడ్డి హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి కబ్జా పెట్టేశారని ఆరోపించారు. మరోవైపు మల్లారెడ్డి మాత్రం ఈ భూమి తనది కాదని నిరూపిస్తే..తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ కూడా విసిరారు.అయితే అడ్లూరి అధికార పార్టీ ఎమ్మెల్యే కావడం..మాజీ మంత్రి మల్లారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ కోరడంతో ఈ వ్యవహారం మరింత ఆసక్తికరంగా మారింది. మల్లారెడ్డికి సోమవారం సీఎం రేవంత్ అపాయింట్మెంట్ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సుచిత్రలోని తన రెండు ఎకరాల వివాదాస్పద ల్యాండ్ గురించి వివరంగా తెలియజేశారు. ఇందుకోసం ఆయన ల్యాండ్ కు సంబంధించిన అన్ని రకాల పేపర్లను సీఎం వద్దకు తీసుకెళ్లి చూపించాలని చూస్తున్నారు. ఇక మల్లారెడ్డిని ముఖ్యమంత్రిని కలవనుండడంతో అడ్లూరి లక్ష్మణ్ కూడా సీఎమ్ఓ అపాయింట్మెంట్ తీసుకోనున్నట్లు తెలుస్తోంది.బాధ్యత గల మంత్రిగా పనిచేసిన మల్లారెడ్డి సుచిత్రలోని సర్వేనెంబర్ 80లో చేసిన ఘనకార్యాలు ఏంటో.. సీఎం రేవంత్ రెడ్డికి వివరించాలని అడ్లూరు భావిస్తున్నారు. అయితే ఇద్దరి ఎమ్మెల్యేల మధ్య పంచాయతీ పెద్దగా వ్యవహరించబోతున్న ముఖ్యమంత్రి రేవంత్..ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# మెట్రో నష్టాలు నిజం కాదా?



**హైదరాబాద్ :** ఆ మధ్య హైదరాబాద్ మెట్రో ఎండీ విలేకరుల సమావేశం పెట్టి మాట్లాడాడు గుర్తుంది కదా.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం.. మెట్రోను బాగా దెబ్బతీస్తోంది. వచ్చే ప్యాసింజర్లు బాగా తగ్గిపోయారు. ఇలాగైతే మెట్రోను మూసుకోవడమే.. అని అన్నాడు... హైదరాబాద్ ఆదాయం పడిపోతుంది. అదే మా కేసీఆర్ ఉండి ఉంటే ఇట్లుండేదా.. అసలు ప్రజలు మాకు తప్ప కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశారు.. రేవంత్ రెడ్డి ని ఎందుకు ముఖ్యమంత్రిని చేశారు.. అన్నట్టుగా రాసుకు వచ్చింది.. నిజంగానే మెట్రో నష్టాల్లో ఉందా.. మెట్రో ఎండీ వ్యాఖ్యలు చేయడం.. దానికి తగ్గట్టుగా నమస్తే తెలంగాణ మసాలా పూయడం.. భారత రాష్ట్ర సమితి నాయకులు తమదైన శైలిలో విమర్శలు చేయడం.. ఇవన్నీ చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని చులకన చేయాలని చూస్తున్నట్టే కనిపిస్తోంది. వాస్తవంగా లోతుగా తవ్వితే మెట్రో చెప్పినట్టుగా ఆ స్థాయిలో నష్టాలు లేవు. కానీ మెట్రో ఎండీ మాత్రం కేసీఆర్ కు ట్యూన్ అయినట్టు వ్యాఖ్యలు చేస్తున్నారు.హైదరాబాద్ మెట్రోలో ప్రతిరోజు 4.5 లక్షల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్తున్నారు. ప్రయాణికుల ద్వారా ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు టికెట్ల విక్రయంతో కోటిన్నర దాకా ఆదాయం వస్తోంది. ఈ ప్రకారం సగటున ఒక్కో ప్రయాణికుడు 35 రూపాయలు చెల్లించి మెట్రోలో ప్రయాణిస్తున్నాడు. ఈ ప్రకారం సగటు ప్రయాణం దూరం 12.5 కిలోమీటర్ల కంటే తక్కువగానే ఉంది. కేవలం ప్రయాణికుల నుంచి చార్జీలు మాత్రమే కాకుండా వాణిజ్య ప్రకటనలు, స్టేషన్లు, మాల్స్ లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం వస్తోంది. ఈ లెక్కలన్నీ కూడా ఎల్ అండ్ టీ గత ఏడాది మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ప్రకటించినవే.ఇక ఆపరేషన్లు, ఇతర మార్గాల ద్వారా 703.20 కోట్ల ఆదాయం మెట్రోకు సమకూరింది. మెట్రో నిర్వహణ వ్యయం 429 కోట్లు పోతే.. మిగతాది మొత్తం లాభమే.. మరి మెట్రో ఎండీ చెబుతున్నట్టు నష్టాలు ఎక్కడి నుంచి వచ్చాయి.. అయితే మెట్రో రైలు, మాల్స్ నిర్మాణానికి 12,500 కోట్లకు పైగా నిధులను ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ కొంత ఈక్విటీ, మిగతావి బ్యాంకుల కన్సార్షియం నుంచి అప్పు తీసుకొచ్చింది.. 2023 మార్చి 31 తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ప్రతి ఏడాది తీసుకొచ్చిన రుణాలపై వడ్డీనే 1,273 కోట్లను చెల్లిస్తున్నట్టు ఎల్ అండ్ టీ తన వార్షిక ఆర్థిక నివేదికలో ప్రకటించింది. ఈ వడ్డీ బారాన్ని ఎల్ అండ్ టీ ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో తగ్గించుకుంది. షాపింగ్ మాల్స్, భూముల సబ్ లీజ్.. వంటి వాటిపై గత ఆర్థిక సంవత్సరం 900 కోట్ల వడ్డీ లేని రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఇక రాయదుర్గంలోని 15 ఎకరాల భూమిని ఒక 1,045 కోట్లకు మానిటైజ్ చేసింది. ఇందులో 512 కోట్లు గత ఏడాది ఎల్ అండ్ టీ సంస్థకు చేరాయి. ఎర్రమంజిల్, పంజాగుట్ట, హైటెక్ సిటీ ప్రాంతాలలోని షాపింగ్ మాల్స్ ను ఎల్అండ్ టీ మరో సంస్థకు సబ్ లైసెన్స్ కు ఇచ్చింది. వీటి ద్వారా 3,000 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. వీటి ద్వారా 5000 కోట్ల రుణ భారాన్ని దించుకునేందుకు ఎల్ అండ్ టీ సర్దుబాటు చేసింది. దీనివల్ల వడ్డీ భారాన్ని తగ్గించుకుంది.ఎల్ అండ్ టీ మెట్రో ఆదాయం పెరగాలంటే.. ప్రయాణికుల సంఖ్య పెరగాలి.. రద్దీని తట్టుకునేందుకు అదనపు మెట్రో రైళ్లు కావాలి.. కోచ్ ల సంఖ్యను ఆరుకు పెంచుకోవాలి. ప్రయాణికులను చేరవేసే వేళలను పెంచాలి. ప్రస్తుతం సోమ, శుక్రవారం మాత్రమే ప్రయాణికుల వేళలను ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నారు.. హైదరాబాద్ కాస్మోపాలిటన్ సిటీ కాబట్టి.. ప్రతిరోజు పెంచిన వేళల ప్రకారం నడిపితే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. సాధ్యమైనంతవరకు అర్ధరాత్రి ఒంటిగంట వరకు రైళ్లు నడిపితే ఆదాయం పెరుగుతుందని రైల్వే రంగ విశ్రాంత నిపుణులు పేర్కొంటున్నారు.